# అరటికాయ రంగు చొక్కా

— చిరుమన వెంకటరమణయ్య

నీరజ పుట్టాక ఆమె తండ్రి చంద్రశేఖరం వ్యాపారంలో బాగా సంపాదించాడు. అయితే ఆమె పెళ్ళీడు కొచ్చేసరికి కాలం కలిసిరాక భాగస్తులు మోసం చేయడంతో బాగా చితికిపోయాడు. నీరజ అంద చందాలు, అణుకువ, అభిమానం గలది. కానీ ఈ కాలం ట్రెండు ప్రకారం కాసులుంటేనే గదా కళ్యాణ యోగం. చాలా సంబంధాలు కట్నం దగ్గరే ఆగిపోయాయి. అంతా మంచికే అన్నట్లు డబ్బుకు విలువివ్వని గౌతమ్ నీరజ సౌందర్యాన్ని సౌశీల్యాన్ని, చంద్ర శేఖరం మంచి తనాన్ని చూసి ఆకర్షితుడై పట్టుబట్టి ఆమెను పెళ్ళి చేసుకున్నాడు.

ఉగాది సమీపిస్తున్నది గౌతమ్. నీరజలకు అది కొత్త పండుగ. చంద్రశేఖరం వచ్చి కూతుర్ని, అల్లుణ్ణి ఊరికి తీసుకు వెళ్ళాడు. బాగా బతికిన వారు కనుక ఉన్నంతలో అన్ని మర్యాదలు సవ్యంగానే జరిపారు. తిరుగు ప్రయాణమయ్యే టప్పుడు చంద్ర శేఖరం వారికి కొత్త బట్టలు, కొంత డబ్బు యిచ్చాడు.

"ఇప్పుడివన్నీ ఎందుకు చెప్పండి మామయ్యా! మీరు పెద్దరికంతో, అనుభవంతో దగ్గర కూర్చుని నాకు సలహాలిస్తుంటే చిన్నప్పుడే తండ్రి చనిపోవడంతో నా మనసున కమ్ముకున్న అభద్రతా భావం చెదిరిపోయి ఆత్మ విశ్వాసం పెరుగుతోంది. మీరు చూపే వాత్సల్యం ముందు డబ్బు, వస్తువులు గొప్పవికావు. నా దృష్టిలో వాటికంత ప్రాధాన్యత లేదు." అంటూ అభ్యంతరం చెప్పాడు.

"అలా అనకు బాబూ! ఇది ఆచారం మీ హోదాకు తగ్గ కట్నం ఇచ్చుకోలేక పోయామని ఇప్పటికే మేమెంతో అపరాధ భావంతో మెలుగు తున్నాం. పైగా మాకు మర్యాద, మా అమ్మాయికి గౌరవం దయ చేసి కాదనకు" అని పట్టుబట్టాడు.

చంద్రశేఖరం యింటికి ఎదురు వరుసలో ఎడమ వైపుగా మూడో యిల్లు కాంతమ్మది. ఆమె చంద్రశేఖరం పెదనాన్న కుమార్తె. గౌతమ్ వాళ్ళు ఆ ఊరికి ఎప్పుడు వచ్చినా కాంతమ్మ ఇంటికి కూడా వెళుతుండేవారు. బస్సు ఎక్కేందుకు కూడా ఆ దారినే వెళ్ళాలి. గౌతమ్, నీరజలు ఊరికి బయలు దేరుతూ చెప్పి పోదామని కాంతమ్మ యింటికి వెళ్ళారు. మాటల మధ్యలో ఆమె "అమ్మాయ్ నీరజా! మీ నాన్నగారు కొత్త బట్టలు పెట్టి నట్లున్నారు నేను చూడొచ్చా" అన్నది. నీరజ వాటిని చూపింది. ఆమె ముఖం అదోలా పెట్టి నిట్టూరుస్తూ "ఏమయ్యా గౌతమ్! మీ మామగారు బొత్తిగా కక్కుర్తి మనిషిలా వున్నాడే. లేకపోతే పండక్కో పబ్బానికో అల్లుడికి పెట్టే బట్టల్లో కూడా పిసినారి తనమేనా! ఈ గుడ్డ చూడు ఎంత ముతగ్గా వుందో! అసలీ చొక్కా రంగేమిటి? దీన్ని వేసుకుని ఆఫీసుకు వెళితే అందరు నిన్ను వేముల స్వామిలా వున్నావని ఎగతాళి చేయరూ! అయినా నాకెందు కొచ్చిన గొడవలే. ఏదో వుండబట్టలేక వున్నమాట అన్నాను" అని దీర్ఘాలు తీస్తూ పలికింది. నీరజ బాధపడుతుందేమోనని గౌతమ్ మాట మార్చి "బస్సుకు టైమవుతుంది ఇక వుంటాము పిన్ని గారు" అని కాంతమ్మకు వీడ్కోలు చెప్పాడు.

కాంతమ్మ మాటలు గౌతమ్ మనసులో బాగా నాటుకున్నాయి. అయితే ఆమె పలుకులు మామ గారి మీద గౌరవాన్ని కొంచెం కూడా తగ్గించలేదు గానీ, ఆ బట్టలు వేసుకుంటే అందరు నవ్వుతారనే జంకు మాత్రం మనసులో నిలిచిపోయింది. 'డబ్బు లేకపోతే ఊరు కోవాలి గాని వద్దన్నా వినకుండా యిలా నాసిరకం బట్టలు పెట్టి యిబ్బంది పెట్టడమెందుకు' అనుకున్నాడు. వాటిని కుట్టించు కుందామన్న మక్కువగానీ ధ్యాసగానీ లేకుండా పోయాయి. నీరజ చెప్పగా పోరు పడలేక టైలరు దగ్గర యిచ్చాడు. కుట్టించుకున్నాడే గాని వాటిని ఒక్క రోజైనా వేసుకున్న పాపాన పోలేదు. ఈలోగా చంద్రశేఖరం రెండు మూడు దపాలు వచ్చి వెళ్ళాడు. ఆయన వచ్చినప్పుడల్లా "అమ్మా నీరజా! నేను తెచ్చిన బట్టలు అల్లుడుగారికి నచ్చాయో లేదో? కాటన్ పంచె ఖద్దరు చొక్కా తప్ప మరొకటి ఎరుగని వాణ్ణి. ఈ కాలపు బట్టలు గురించి నాకం తగా తెలియదు. అల్లుడుగారు నేను తెచ్చిన బట్టలు వేసుకుని వుండగా చూద్దామనుకున్నాను. ఎప్పుడూ వేసుకున్నట్లుగా కనబడలేదు. అందుకే అడిగానమ్మా" అంటూ ప్రస్తావించేవాడు.

"అదేం లేదు నాన్నా! ఆయన అలాంటివారు కాదు. చాల మంచివారు. మీరు పెట్టిన బట్టలు ఆయనకి బాగా నచ్చాయి. వాటినే ఎక్కువగా వేసు కుంటున్నారు" అంటూ తండ్రిని అనునయించేది నీరజ. ఒకసారి గౌతమ్ తండ్రీ కూతుళ్ళ సంభాషణ విన్నాడు. వారిని బాధపెడుతున్నందుకు లోలోన విచారపడ్డాడేగానీ ఆ బట్టలు వేసుకునే ప్రయత్నం మాత్రం చేయలేదు.

ఒకసారి బాగా ముసురు పట్టి వారం రోజులు





ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. పని మీద బయట తిరిగేటప్పుడు వానకి తడవడం వల్ల, నడిచేటప్పుడు బురద పడడం చేత బట్టలు వెంట వెంటనే మార్చ వలసి వచ్చింది. వున్న బట్టలన్నీ మాసి పోయాయి. వర్షం కారణంగా చాకలి రాలేదు. ఆ సమయంలోనే నీరజకు జ్వరం వచ్చింది. ఆ పరిస్థితిలో ఆమెను బట్టలు ఉతకమనడం భావ్యం కాదనుకున్నాడు. ఇక మిగిలింది అత్తగారు పెట్టిన ఆ కొత్త బట్టలే. గత్యంతరం లేక వాటిని వేసుకున్నాడు. 'ఆ బట్ట లేమిటి ఆ రంగేమిటి' అని ఎవరన్నా ఎగతాళి చేస్తారేమోనని జంకుతూ ఆఫీసుకు బయలుదేరాడు.

దారిలో అతని మిత్రుడు సుబ్బారావు ఎదురయ్యాడు. "హలో గౌతమ్! ఇవాళ పండుగా కాదు నీ పుట్టిన రోజు అంతకన్నా కాదు. స్పెషల్ డ్రస్సు వేశావు ఏమిటి విశేషం? ఏది ఏమయినా ఈ డ్రస్సులో నువ్వు చాలా బాగున్నావు. ఈ రంగు నీకు చక్కగా అమరింది" అన్నాడు. గౌతమ్ అసహనంగా "అయ్యాయా పొగడ్తలు, పరాచికాలు" అన్నాడు. సుబ్బారావు ఆశ్చర్యపోతూ "ఇందులో పరిహాసమేముందిరా యిడియట్! నీతో నేనెప్పుడైనా వేళాకోళమాడానా? ఈ బట్టలు నిజం గానే బాగున్నాయి" అన్నాడు.

ఆఫీసులో అందరు గూడా గౌతమ్ దుస్తులు బాగున్నాయన్నారు. గుమాస్తా గున్నారావయితే "ఈ అరటి కాయ రంగు చొక్కా తీసుకోవాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నాను. ఏ షాపులోను నచ్చిన రంగు దొరకడం లేదు. ఎంటో నాకు బట్టలు సరిగా కుదిరి చావవు" అని ఈర్ష్య పడ్డాడు.

అందరూ మెచ్చుకుంటూ వుండడంతో గౌతమ్‌కి ఆ బట్టల పైన మక్కువ కలిగింది. వాటినే ఎక్కువగా వేసుకోసాగాడు. ఆ బట్టలు వేసుకున్నప్పుడల్లా నీరజ అతని వంక అదోలా చూసేది. ఇంత మంచి బట్టలు భర్తకు ఎందుకు నచ్చలేదో? అన్నట్లుండేది ఆమె దృష్టి.

ఒకసారి గౌతమ్ బస్సులో ఆఫీసుకి వెళుతుండగా అతని ప్రక్కనే కూర్చున్న ఒకాయన "బాగున్నారా" అని పలకరించి "మీరు చంద్రశేఖరం అల్లుడు కదూ. మాదీ ఆ వూరే, నా పేరు వీరభద్రయ్య. బట్టల వ్యాపారం చేస్తుంటాను. ఆ గ్రామంలో మాదే పెద్ద షాపు. ఇప్పుడు మీరు వేసుకున్న బట్టలు మా షాపులో తీసినవే. పండక్కి అమ్ముడవుతాయని ఖరీదైన బట్టలు తెచ్చి పెట్టాను. మీ మామగారు చాలా మంచి వారు. పెద్ద మనిషి. ఆయన మా షాపుకి వచ్చి "మా అల్లుడికి మంచి బట్టలు కావాలి ఖరీదు ఎక్కువయినా పరవాలేదు" అని అడిగితే వీటిని నేనే ఎంపిక చేశాను. మంచి కంపెనీ బట్టలు, వెయ్యి రూపాయలు అయింది. పాపం చంద్రశేఖరం ఆ అప్పు ఇప్పటికీ తీర్చలేకున్నాడు" అన్నాడు. గౌతమ్‌కి కడుపులో దేవినట్లైంది. అతను మామూలుగా కొనే బట్టలు నాలుగైదు వందలకు మించి వుండవు.

ఇంటికి వెళ్ళిన గౌతమ్ భార్య దగ్గర కూర్చుని "క్షమించు నీరజా! కాంతమ్మ మాటలకులోనై మీ నాన్నగారు పెట్టిన బట్టల్ని వేసుకోకుండా మిమ్మల్ని ఎంతో క్షోభ పెట్టాను" అన్నాడు. నీరజ భర్తను అనునయిస్తూ "ఆ కాంతమ్మకి మా అమ్మకి అంతకు వారం క్రితమే చిన్న తగాదా జరిగిందట. అప్పుడు వారి మధ్య మాటలు గానీ రాకపోకలుగానీ లేవు. అందుకే మీ ముందు మా నాన్నని అలా దెప్పి పొడిచింది" అన్నది. గౌతమ్ కోపంగా "ఈ విషయం నాతో అప్పుడే ఎందుకు చెప్పలేదు" అని గద్దించాడు. "ఈ సంగతి మీతో ఆనాడే చెప్పి వుంటే మా నాన్నను చులకనగా చేసి మాట్లాడిందన్న అక్కసుతో అలా అంటున్నానని, ఆయనను వెనకేసుకొస్తున్నానని మీరు అపోహ పడే ప్రమాదముంది. దాని వల్ల రిజల్టు మరింత నెగెటివ్ అవుతుంది. ఇలాంటి సందర్భాలలో అసలు సంగతి మీ అంతట మీరు తెలుసుకునే దాకా ఆగడమే సరియైన మార్గం. అందుకే ఆ ప్రస్తావన తీసుకురాలేదు" అన్నది.

"మంచి తనం మూర్తీ భవించిన మీ ముందు నేనెంతో అల్పుణ్ణనిపిస్తుంది. సొంత ఆలోచనలేక ఇతరుల అభిప్రాయాలకు లోనై ప్రవర్తించడం ఒక విధమైన బానిసత్వం. నా 'సజస్టబుల్ మెంటాలిటీ'కి సిగ్గు పడుతున్నాను. ఈ డ్రస్సు వెంటనే వాష్ చేయి. మనం రేపే వూరెళుతున్నాం. ఈ బట్టల్లో మామయ్య గారికి కనబడలి. వారి కళ్ళ లో ఆనందం చూడాలి" అన్నాడు.

"మీకేదొచ్చినా పట్టలేం. ఇందులో మీ తప్పేం లేదు. అటువంటి మాటలు విన్నప్పుడు ఎవరికైనా అలాగే అనిపిస్తుంది. బట్టలలో చీప్ క్వాలిటీ, బెస్ట్ వెరైటీ చాలా సందర్భాలలో వాటి టెక్చరల్ నాలెడ్జి బాగా వున్నవారికి తప్ప, మొదట్లో ఇంచుమించు ఒకే రకంగా కనబడతాయి. కాలం గడిచే కొద్దీ వాటి నాణ్యత మన్నికలో తేడా తెలుస్తుంది. పైగా మనం ఏ దృష్టితో చూస్తే అదే గోచరించడం సహజం. జీవితంలో ఇలాంటివి మామూలే మరీ ఇంత సెన్సిటివ్ అయితే ఎలా?" అంటూ కట్టలు తెంచుకున్న సంతోషంతో గౌతమ్ కౌగిలిలో వాలిపోయింది. ❋